క్లుప్తంగా

ఆలయ ధర్మకర్తల ఎంపిక


ధర్మకర్తలను సన్మానిస్తున్న సభ్యులు

కురిచేడు: స్థానిక దర్శి రోడ్‌లోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ధర్మకర్తలను గురువారం ఎంపిక చేశారు. మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దేవాలయానికి ధర్మకర్తలుగా మైలోజి పరబ్రహ్మాచారి, పెసరపాటి చిన్న శంకరయ్యలను ఎంపిక చేశారు. సామంతపూడి వీర బ్రహ్మాచారి, బంగారు వీర బ్రహ్మాచారి, క్రిస్టిపాటి వెంకట రత్నాచారి, ఉప్పులూరి గోపి, చెరువుగట్టు నాగరాజు, కొండలు, జూపూసి గురుకాంతాచారి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

పెద్దదోర్నాల: అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి శ్రీశైలం రహదారిలోని ఓ ఆటోమొబైల్ షాపు ఎదుట జరిగింది. మండల కేంద్రంలో యాచన చేసే అతను బుధవారం రాత్రి శ్రీశైలం రహదారిలోని ఓ ఆటో మొబైల్ షాపు ఎదుట నిద్రపోయాడు. గురువారం ఉదయం సదరు యజమాని షాపును తెరిచేందుకు రాగా యాచకుడు మృతి చెందిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన అతను కొన్ని రోజుల నుంచి శ్రీశైలం రహదారిలోని దుకాణాల మందే ఉంటున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పోలీసులు యాచకుడి వివరాల కోసం దర్యాప్తు చేపట్టారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పుల్లలచెరువు: మండల సర్వసభ్య సమావేశం సభ్యుల కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో వసంతరావు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నిర్వహించిన సమావేశానికి 16 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే హాజరు కావడంతో సభను వాయిదా వేశామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సమావేశాలకు ఇతరులు హాజరు కాకూడదని, కేవలం సభ్యులు మాత్రమే హాజరు కావాలని, వారి కుటుంబ సభ్యులు హాజరైతే ప్రభుత్వ విధులను అతిక్రమించినట్లు ఉంటుందని, సమావేశాలకు తప్పనిసరిగా సభ్యులు హాజరు కావాలని కోరారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయాలపాలైన రాంబాబు


జగన్నాథం శ్రీను..

దర్శి: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కొత్త రెడ్డిపాలెం సమీపంలో గురువారం రాత్రి జరిగింది. దర్శికి చెందిన జగన్నాథం శ్రీను పొదిలి నుంచి దర్శికి వస్తున్నాడు. పెరుకె రాంబాబు దర్శి నుంచి పొదిలి వెళ్తున్నాడు. కొత్తరెడ్డిపాలెం గ్రామం దాటిన వెంటనే ఎదురెదురుగా వచ్చిన మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరూ కింద పడిపోయారు. శ్రీనుకు కాలు విరగ్గా రాంబాబుకు తలపై దెబ్బ తగిలి ముక్కులు, చెవులు, నోట్లో నుంచి రక్తం వచ్చింది. క్షతగాత్రులను 108లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

20న మండల సమావేశం

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

క్రీడా వికాస కేంద్రం లీజుకు దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం టౌన్: పట్టణంలోని క్రీడా వికాస కేంద్రం లీజు కోసం ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీఓ జి.రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ టెండర్లను ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ ఒంగోలులోని డాక్టర్ పి.ఆనంద్ మినీ స్టేడియంలో అందజేయాలని కోరారు. అందిన దరఖాస్తుల వివరాలను ఫిబ్రవరి 6వ తేదీన వెల్లడిస్తామన్నారు. వివరాలకు 91211 06840 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చిన్ననోటు లేక పదింతల కష్టం

- మార్కెట్‌లో తగ్గిన రూ.10 నోట్ల చలామణి
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, చిరువ్యాపారులు


చలామణిలో తక్కువగా ఉన్న పది రూపాయల నోటు

పుల్లలచెరువు:

పది రూపాయల నోటు చిన్నదే అయినా ప్రతి ఒక్కరికీ చాలా అవసరం. ప్రస్తుతం మార్కెట్‌లో వాటి చలామణి తక్కువగా ఉండటంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలామణిలో చిరిగిన, బాగా దెబ్బతిన్న నోట్లు తప్ప కొత్తవి రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో చలామణి అవుతున్నా ఆ నోట్లు జేబులో పెట్టుకుంటే చిరిగి పోయే పరిస్థితులు ఉన్నాయి. నిరక్షరాస్యులైన వ్యాపారులు, ప్రజలు చిరిగిన నోట్లను తీసుకునేందుకు ఇష్టపడక పోవడంతో అన్ని వర్గాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో 1, 2.5 రూపాయల నాణేలు ఉన్నా వాటిల్లో 5 రూపాయల నాణెం వినియోగంలో ఉంది. 10 రూపాయల నాణెం ఉన్నా పెద్దగా చలామణిలో లేదు. వాటితో పాటు రూ.10 నోట్ల చెలామణి భారీగా తగ్గింది. చిరు వ్యాపారులు, కూరగాయల దుకాణాలు, చిన్న చిన్న హోటళ్లు, టీకొట్లు, ఆటోలు, బస్సుల్లో రూ.10 నోట్ల వినియోగం బాగా పెరిగిపోయింది. అందుకు తగిన విధంగా ఆ నోట్లు అందుబాటులో లేకపోవడం కష్టంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. రూ.20 నోట్ల చెలామణిలో ఎక్కువగా ఉందని, దానితో పాటు రూ.10 నోటు ఎక్కువగా కనిపించడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. రూ.100 నోటును ఇస్తే తిరిగి చిల్లర ఇచ్చేందుకు వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

డిజిటల్ చెల్లింపులతో కొంత మేలు

ఇప్పటికే కొంత మేరకు అన్ని వ్యాపార సంస్థల్లో డిజిటల్ చెల్లింపులు చెలామణిలో ఉన్నాయి. మరికొందరు వాటి వినియోగంలో అనుమానాలు పడుతున్నారు. బస్సుల్లో ప్రయాణించేటప్పుడు యూపీఐల ద్వారా చెల్లింపులు చేయాలన్నా కండక్టర్ వద్ద ఉండే ఆర్టీసీ యాప్ సక్రమంగా పనిచేయడం లేదని, ఆ సమయంలో చిల్లర సమస్య వేధిస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. చిల్లర సమస్య ఉందని భావించిన కొందరు రూ.10 నోట్లను చాలా వరకు వారి అవసరాలకు ఉపయోగపడతాయని భద్రపరచుకుంటున్నారని, దీంతో కొరత ఎక్కువగా ఉంటోందని భావిస్తున్నారు. బ్యాంకుల ద్వారా రూ.10, 20 నోట్ల విరివిగా విడుదల చేసి చిల్లర సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. వ్యాపార లావాదేవీలకు అంతరాయం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెరుగుతున్న చలి తీవ్రత


ఉదయం 8 గంటల వేళ మంచు ప్రభావం ఇలా..


చలి కాగుతున్న ప్రజలు

కొనకనమిట్ల: వాతావరణంలో మార్పుల కారణంగా కొన్ని రోజులుగా మంచుతోపాటు చలి ప్రభావం రోజు రోజుకూ పెరుగుతోంది. చలి ప్రభావంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల చలి పెరగడంతో పాటు మంచు ప్రభావం కూడా ఉదయం 9, 10 గంటల వరకు ఉండటంతో ముఖ్యంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో గ్రామాల్లో పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే మంచుతో చలి పెరగడంతో పొలం పనులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు రైతులు పేర్కొన్నారు. చలి ప్రభావంతో ఉదయాన్నే ప్రజలు చలి మంటలు వేసుకుంటూ చలి కాగుతున్నారు. మంచు, చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో పలువురు జలుబు, జ్వరాలతో పాటు న్యూమోనియా వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రస్తుత తరుణంలో చిన్న పిల్లలు, వృద్ధులు పట్ల అప్రమత్తంగా ఉండి వారు వ్యాధుల బారిన పడకుండా చూడాలని ప్రభుత్వ వైద్యులు బాలయ్య, పృధ్విరాజ్‌లు సూచిస్తున్నారు. మంచులో సంచరించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో బయట తిరిగే వారు తలకు, శరీరానికి చలిని నివారించే ఉన్ని దుస్తులు ధరించాలని, చిన్నారులను బయట తిప్పడం మానుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రయాణించే సమయాల్లోనూ చలి తీవ్రత నుంచి రక్షణ కలిగించే దుస్తులు వాడుకోవాలని తెలిపారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి


మిరప పంటను పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్‌రావు


ముండ్లమూరు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ

తాళ్లూరు: మండలంలో మిర్చి పంటను 300 ఎకరాల్లో వేశారని, ఎక్కువ తేజ రకం సాగులో ఉందని, ప్రస్తుతం మిరప కోతలు ప్రారంభమైనందున రైతులు మెళకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి ఉంటుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. మండలంలో గురువారం బుద్ధి కూరపాడు, వెలుగువారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మంచు ఎక్కువ కురుస్తున్నందున, మంచుకు తడవకుండా కల్లాల్లో, ఆరబోతల్లో శ్రద్ధ వహించాలని, పచ్చి కాయలు, పక్వానికి రాని కాయలు, కుళ్లిన కాయలు, పిందెలను వేరుపరిచి, కాయ కుళ్లు మచ్చలు రాకుండా చూడాలని చెప్పారు. వీఏఏలు అజ్మీర్, సుష్మా సుల్తానా, రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు

ముండ్లమూరు (దర్శి): తెగుళ్ల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండి సకాలంలో మందులు పిచికారీ చేసుకుని పంటలు కాపాడుకోవాలని వ్యవసాయాధికారి మహ్మద్ పారూక్ సూచించారు. మండలంలోని మారెళ్ల, జమ్ముల మడక గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పొలాలు పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణ, మొక్కజొన్నలో కతేరా పురుగు, కాండం తొలుచు పురుగులను గుర్తించామన్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. వ్యవసాయ సహాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.


దర్శి: మాట్లాడుతున్న ఏఓ బాలకృష్ణనాయక్

దర్శి: వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీలో అందిస్తున్న డ్రిప్ ఉపయోగించుకోవాలని వ్యవసాయాధికారి బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని తూర్పు వెంకటాపురం, లంకోజనపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ పంటలపై ఆశించే చీడ పీడలు, తెగుళ్ల గురించి వివరించారు. ప్రతికూల పరిస్థితుల్లో పంట నష్టం, ఇన్సూరెన్స్ వచ్చే విధానం గురించి వివరించారు. పంట మార్పిడి పద్ధతి ద్వారా పప్పు దినుసులు, కంది, మినుము, పెసర, సాగు చేయడం నేలకు బలం చేకూరుతుందని చెప్పారు. ప్రస్తుతం కందిలో ఆకు ముడత నివారణకు ఎమామెక్టిన్ బెంజోయెట్ ఎకరాకు 100 గ్రాములు చొప్పున వేయాలని తెలిపారు. వ్యవసాయ సహాయకులు అప్పల సుధాకరరావు, హర్షవర్ధన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రత ముఖ్యం


మాట్లాడుతున్న ఎంవీఐ మాధవరావు

మార్కాపురం టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి భద్రత డ్రైవర్లపై ఆధార పడి ఉంటుందని మార్కాపురం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు అన్నారు. గురువారం మార్కాపురం డిపోలో భద్రత మాసోత్సవాల సందర్భంగా మేనేజర్ ఏఎస్ నరసింహులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకుంటూ రాత్రి సమయంలో జాగ్రత్తగా బస్సులు నడపాలని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. డిపో మేనేజర్ నరసింహులు మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా బస్సులు నడపాలని, ప్రజల్లో నమ్మకం పెంచాలని, డిపోకు మంచిపేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


పొదిలిలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి రూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పొదిలి ఆర్టీసీ డిపోలో జరిగిన రోడ్డు భద్రత మాసోత్సవాల సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. సుప్రదమని, ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. గ్రామాల దూరాన్ని తగ్గిస్తూ ప్రజలను దగ్గరకు చేరుస్తున్న ఆర్టీసీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వడమే కాకుండా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రయాణికులకు రవాణా సేవలను మరింత మెరుగుపరిచేందుకు తగిన కృషి చేస్తుందన్నారు. డిపో మేనేజర్ శంకరరావు, ఎస్ఐ వేమన, ఎంఎఫ్ నాగరాజు, ఆర్టీసీ సీఐ ధనలక్ష్మి, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీనివాసులు


కొమరోలు : రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాజశ్రీ

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు, బురుజుపల్లి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు డీ బాలాజీనాయక్ మాట్లాడుతూ రబీ 2024-25 కు సంబంధించి రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమం పై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కూలీ, వ్యవసాయ ఆధారిత వృత్తుల పై జీవించే వారు పొలం పాసు పుస్తకం, ఆధార్, సెల్‌నెంబరు తో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ సహాయకులు ద్వారా అన్ని రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయభాస్కర్ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, అలసంద పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని పెద్ద యాచవరం, పెద్ద నాగులవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంట పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడారు. లేత పైర్లు అయిన మొక్కజొన్న, అలసంద పైర్లను రైతులు తరుచూ గమనిస్తూ తెగుళ్లు సోకితే వెంటనే వ్యవసాయ సిబ్బంది సలహాల మేరకు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. దిగుబడుల కోసం అత్యధికంగా ఎరువులు వేయవద్దని సూచించారు. ప్రతి రైతు ఈ-పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది జయంతి, నవ్య, రైతులు పాల్గొన్నారు.

కొమరోలు: రబీ సీజన్‌లో వేసిన పంటలకు సంబంధించి ఈ-పంట నమోదును రైతులందరూ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి రాజశ్రీ తెలిపారు. మండలంలోని కొమరోలు, తాతిరెడ్డిపల్లె గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా క్షేత్రస్థాయి పరిశీలనలో మండల వ్యవసాయశాఖ అధికారిణి రాజశ్రీ వరి, శనగ, కంది పంటలను పరిశీలించి ఆ పంటల్లో వచ్చే చీడపీడలు, వాటి నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

తర్లుపాడు: మండలంలోని సీతానాగులవరం, గోరుగుంతలపాడు రైతులకు ఏఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కంది, శనగ పంటల సాగు చేసిన రైతులకు యాజమాన్య పద్ధతులపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనగలో పచ్చపురుగు, ఎండు తెగులు నివారణకు మందులు సూచించారు. కందిలో పూత రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వీఏఏలు పూర్ణ శంకర్, బాబు, గోవింద్ బాషా, శివప్రియ, పలువురు రైతులు పాల్గొన్నారు.

చినమనగుండం మాజీ సర్పంచ్ మృతి


కొల్లా రమణయ్య (ఫైల్)

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం మాజీ సర్పంచ్ కొల్లా రమణయ్య (90) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గతంలో సర్పంచ్‌గా పని చేసి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. రమణయ్యకు భార్య సుబ్బమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కుమారుడు కోటేశ్వరరావు కూడా గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. శుక్రవారం చినమనగుండంలో అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.

మాజీ డీలర్ మృతికి కేపీ, అన్నా నివాళి

మార్కాపురం: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన మాజీ డీలర్ పిచ్చిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి గురువారం మార్కాపురం, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీరి వెంట పార్టీ నాయకులు లయోల చెంచిరెడ్డి ఉన్నారు.

లక్ష్మీ తిరుమలనాథ స్వామి రథోత్సవం

బేస్తవారిపేట: మండలంలోని కోనపల్లె లక్ష్మీతిరుమలనాథస్వామి సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారిని పూల ఇంద్ర రథం(పూల పల్లకి) సేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహించారు. శుక్రవారం వసంతోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

పొదిలి రూరల్: పొదిలి ఆర్టీసీ బస్టాండ్‌లో నిత్యం దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. రోజూ ఏదో ఒక సమయంలో ప్రయాణికుల దగ్గర నుంచి విలువైన సెల్‌ఫోన్లు, నగదు జేబుదొంగలు దోచుకుంటున్నారు. గురువారం పొదిలి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఓ యువతి పర్సు కొట్టేశారు. అందులో ఉన్న 8 వేల రూపాయలు దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆ యువతి కన్నీరు పెట్టుకుంది. చివరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కత్తెర పురుగుతో నష్టం

బేస్తవారిపేట: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు, మారుకా మచ్చల పురుగుతో పంటకు నష్టం జరుగుతుందని నివారణకు వేపనూనే లీటర్ నీటికి 5 ఎంఎల్, ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు కలిపి పిచికారి చేసుకోవాలని వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ అన్నారు. గురువారం మండలంలోని పందిళ్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

నాగుపాము కలకలం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల సమీపంలో నాగుపాము కలకలం రేపింది. ఓ గృహంలో నాగుపాము బుసలు కొడుతూ కనిపించడంతో ఫారెస్టు అధికారులకు సమాచారమందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అటవీ శాఖ సిబ్బంది పామును పట్టుకొని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి వదిలేశారు.